క్లుప్తంగా

శొంఠ్యాంలో జగనన్న భూరక్ష సర్వే



డ్రోన్ సర్వేలో పాల్గొన్న అధికారులు

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాంలో శనివారం జగనన్న భూరక్ష పథకం సర్వే ప్రారంభమైంది. సర్వే బృందం డ్రోన్ ఎగరేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డ్రోన్ షాట్లు ద్వారా ఫీల్డ్ మ్యాప్‌లు వచ్చిన తర్వాత సర్వే నంబర్ల వారీగా సమగ్ర భూ సర్వే జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు లెంక రాంబాబు, కోరాడ వెంకట రమణారావు, పల్ల రమణ, గొల్జాన రవి, కోరాడ పాపునాయుడు, బొద్దపు అప్పారావు పాల్గొన్నారు.

అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ



దుప్పటి అందిస్తున్న సంఘం ప్రతినిధులు

పద్మనాభం: మండలంలోని రేవిడి జంక్షన్ నుంచి మహారాజుపేట, ఆనందపురం జంక్షన్ వరకు రోడ్డుకి ఇరువైపులా 50 మంది అనాథలు, అభాగ్యులకు శ్రీ శ్రీనివాస రేవిడి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు పతివాడ ఇంద్రరావు, ఉపాధ్యక్షుడు మరగడ చిరంజీవి, సభ్యులు ఒమ్మి పైడినాయుడు, ఎం.ఆదినారాయణ, పి.అప్పలరాజు, పి.ఎల్లయ్య, బంగారాజు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు స్టౌలు అందజేత



లబ్ధిదారులకు స్టౌలు అందిస్తున్న నాయకులు

ఆనందపురం : మండలంలోని వేములవలస, లొడగలవానిపాలెం లబ్ధిదారులకు శనివారం వేములవలసలో ప్రధానమంత్రి ఉజ్వల భారత్ గ్యాస్ పథకం కింద మంజూరైన గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. వేములవలస పంచాయతీలో 21 మందికి, లొడగలవానిపాలెం పంచాయతీలో 30 మందికి అందజేశారు. కోరాడ అప్పలస్వామి నాయుడు, లొడగల రమణ, బోద నారాయణప్పడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాఫ్ట్ టిష్యూ లేజర్‌పై వర్క్‌షాప్

కొమ్మాది: గీతం దంత కళాశాల ఆస్పత్రి పెరియోడాంటిక్స్ విభాగం ఆధ్వర్యంలో సాఫ్ట్ టిష్యూ లేజర్‌పై గత రెండు రోజులుగా జరుగుతున్న వర్క్ షాప్ శనివారం ముగిసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 136 మందికి పైగా దంత వైద్యులు ఇందులో పాల్గొన్నారు. గీతం ఆస్పత్రి ప్రిన్సిపాల్ విజయరామరాజు పాల్గొని సాఫ్ట్‌టిష్యూ లేజర్ విధానాన్ని వివరించారు.

తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట తీరానికి శనివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చింది. మృతునికి సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉంటుందని, గుర్తు పట్టలేని విధంగా ముఖం మొత్తం పాడైందని, వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

పద్మనాభం: మండలంలోని విలాస్కాన్‌పాలెంలో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో గ్రంథాలయ భవన నిర్మాణానికి శనివారం ఎంపీపీ కంటుబోతు రాంబాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు, నల్లి సన్యాస్పడు, బాయి అప్పలస్వామి పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు



మహిళకు కరపత్రం అందించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును శాలువాతో సత్కరిస్తున్న టీడీపీ నాయకుడు కంచర్ల కామేష్

- అవినీతి లేకుండా గొప్ప పాలన
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ప్రజల వద్దకే వారికి అవసరమైన సేవలు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో గొప్ప విషయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 3వ వార్డు ఎగువపేట సచివాలయ పరిధిలోని బ్రాహ్మణవీధి, గంటస్తంభం పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రేషన్‌కార్డులు, పింఛన్లు, పలు ధ్రువీకరణ పత్రాలతోపాటు ఇతర పనుల కోసం ఆయా కార్యాలయాల వద్దకు వెళ్లి అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. దీనివల్ల అందరూ చాలా కష్టాలు పడేవారన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత వలంటీర్లు, సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. అప్పటి నుంచి పేద వారితోపాటు అన్ని వర్గాలకూ సేవలన్నీ ఎంతో సులభంగా అందుతున్నాయన్నారు. అదేకాకుండా ఇళ్ల వద్దకే అర్హులందరికీ పింఛన్లు అందివ్వడం, పేద విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్య, వైద్యంతో పాటు ఎన్నో మంచి పథకాలు అమలవుతున్నాయన్నారు. అవినీతి లేకుండా అర్హులందరికీ నేరుగా పథకాల లబ్ధి చేకూరడం విశేషమని, ఇటువంటి పాలన గతంలో ఎవరూ అందించలేదని కొనియాడారు. ఇంతలా జరుగుతున్న అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాల అమలును చూసి టీడీపీ, జనసేన నాయకులకు ఏం చేయాలో అర్థంకాని పరిస్థితుల్లో మతిభ్రమించి పిచ్చిపిచ్చి ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా రూ.1.04 లక్షల లబ్ధి పొందిన టీడీపీ నాయకుడు కంచర్ల కామేష్ ఇంటి వద్దకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రాగానే... శాలువాతో ఎమ్మెల్యేను కామేష్ సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు మైలిపల్లి లక్ష్మణరావు, గుండాసి మధునాయుడు, రాంభుక్త ప్రభాకర్‌నాయుడు, కదిరి ఎల్లాజీ, చిల్ల భాస్కరరెడ్డి, కోంద్రు రామసూరప్పడు పాల్గొన్నారు.

సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు



మధురవాడలో పూజలందుకున్న సూర్య భగవానుడు



చంద్రంపాలెం హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

మధురవాడ: రథ సప్తమిని పురస్కరించుకుని మధురవాడ కూడలి వద్ద గల నవగ్రహ ఆలయంలో సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవు పేడ పిడకలపై పాయసం తయారు చేసి భక్తులు నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా చిక్కుడు కాయలతో రథాన్ని తయారు చేసి స్వామికి రేగుపళ్లు, చెరుకు గెడలు తదితర పూజా సామగ్రి సమర్పించారు. ఈ సందర్భంగా నవగ్రహ ఆలయానికి భక్తులు విశేషంగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల యోగాసనాలు

రథ సప్తమిని పురస్కరించుకుని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల యోగాసనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సూర్య నమస్కారాలు, సాష్టాంగ ప్రణామం, తదితర ఆసనాలు వేశారు. కార్యక్రమంలో మాజీ పోలీసు అధికారి టీఎస్ఆర్ ప్రసాద్, బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహంతి, ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, పీడీ రాము తదితరులు పాల్గొన్నారు.

పీఎం పాలెం: రథసప్తమి సందర్భంగా కారుషెడ్ కూడలిలోని శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో ఉన్న నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీ శృంగేరీ శంకరమఠం ఆలయంలో, పీఎం పాలెం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్పెషల్ డ్రైవ్‌లో 73 కేసుల నమోదు

ఒక వాహనం సీజ్



తనిఖీలు నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారులు

గోపాలపట్నం: ఫ్యాన్సీ నంబర్లపై రవాణా శాఖ అధికారులు నగరంలో శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 73 కేసులు నమోదు చేశారు. ఒక వాహనాన్ని సీజ్ చేశారు. ప్రత్యేక బృందాలు బోయపాలెం, ఎన్ఎస్‌టీఎల్, మద్దిలపాలెం, గాజువాకలో తనిఖీలు చేశాయి. నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. తనిఖీలు కొనసాగుతాయని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు.

పాడి అభివృద్ధికి పెయ్యి దూడల ఉత్పత్తి పథకం దోహదం



చూడిని నిర్ధారించడానికి ఆవును పరీక్షిస్తున్న వైద్యుడు

ఆనందపురం : పాడి సంపద పెంపొందించడానికి ప్రభుత్వం అమలు పరుస్తున్న పెయ్యి దూడల ఉత్పత్తి పథకం దోహద పడుతుందని ఏపీఎల్‌డీఏ సీఈవో శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బొడ్డపాలెం, వెల్లంకి గ్రామాల్లో గల డెయిరీలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి సంపద వృద్ధి చేసి తద్వారా పాల ఉత్పత్తి పెంచడానికి రూ.850ల రాయితీతో ఇంజక్షన్లు రైతులకు అందజేస్తున్నామని చెప్పారు. ఆ ఇంజక్షన్ల ద్వారా ఆవులకు 90 శాతం ఆడ పెయ్యిలు జన్మిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా ఇదివరకే ఇంజక్షన్లు చేసిన ఆవులను పరీక్షించి చూడి నిర్ధారణ చేశారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆనందపురం పశు వైద్యాధికారి ఎస్.లీలావతి, గోపాలమిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యంలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

కొమ్మాది: విద్యార్థులు బాల్యం నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకున్ననాడే జీవితంలో అత్యున్నత స్థానంలో ఉంటారని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వి.సన్యాసిరావు అన్నారు. బీచ్ రోడ్డు తిమ్మాపురంలో గల విజ్ఞాన్స్ వరల్డ్ వన్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన అంకురన్ - 2023 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రతిభ ఉంటుందని, చదువుతో పాటు ఆ ప్రతిభను వెలికితీస్తే అనుకున్న లక్ష్యానికి చేరుకుంటారన్నారు. నేటి సమాజంలో చదువుతో పాటు నైతిక విలువలు, సమాజం పట్ల గౌరవం, సంస్కృతి, సాంప్రదాయాలు నేర్పాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విజ్ఞాన్ గ్రూప్ సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ ఎస్‌కే చైతన్య, పద్మావతి పాల్గొన్నారు.

పుస్తకాలు చదివితే ఉత్తమ ఫలితాలు



గ్రంథాలయ అదనపు గదిని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

భీమునిపట్నం: విద్యార్థులు పోటీ పరీక్షలు, విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు చదివితే ఎంచుకున్న రంగంలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల సూచించారు. ఇక్కడి కళాశాలలో గ్రంథాలయానికి సంబంధించిన అదనపు గదిని శనివారం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పుస్తకాలు చదవే అలవాటు ఎంతో ఉత్తమమైనదన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏకాగ్రతతో కష్టపడి చదివితేనే ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. గ్రంథాలయ విభాగాధిపతి జి.అనుపమ, అధ్యాపకులు పాల్గొన్నారు.

30న ఉక్కు ప్రజాగర్జనను విజయవంతం చేయండి

డాబాగార్డెన్స్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తామని మోదీ ప్రకటించి ఈ నెల 27 నాటికి రెండేళ్లు పూర్తయింది. రెండేళ్లుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని వివిధ రూపాల్లో ఆందోళనలు, పోరాటాలు కొనసాగుతున్నాయి. మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం.. లేదా మూసేస్తామని ప్రకటిస్తున్న నేపథ్యంలో మోదీ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 30న మధ్యాహ్నం 3 గంటలకు ఉక్కునగరం సెక్టార్-5లో గల త్రిష్గాగౌండ్స్‌లో ఉక్కు ప్రజాగర్జన భారీ సభ నిర్వహించనున్నట్లు అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటూ కార్యాలయంలో ప్రజాగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలు అన్నింటినీ కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు మోదీ ప్రభుత్వం పూనుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏకగ్రీవంగా స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేసినా కేంద్ర ప్రభుత్వం వైఖరిలో మార్పు రాలేదన్నారు. ఎం.జగ్గునాయుడు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, మంత్రి రాజశేఖర్, ఎం. మన్మథరావు, వై. మస్తానప్పపాల్గొన్నారు.

మాదిగలంతా ఐక్యంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు

పద్మనాభం: మాదిగలంతా ఐక్యంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు అన్నారు. మండలంలోని కృష్ణాపురం ఎస్సీ కాలనీలో శనివారం మాదిగలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వై.కె.విశ్వనాథం మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మహాజన సోషలిస్టు పార్టీని మాదిగలందరూ బలపరచాలని కోరారు. ఈ సందర్భంగా భీమునిపట్నం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జిగా ములపర్తి పైడిరాజును ఎన్నుకున్నారు. పద్మనాభం మండల ఇన్‌ఛార్జిగా కె.ఈశ్వరరావు, ఆనందపురం మండల ఇన్‌ఛార్జిగా మారబూడి అప్పారావును ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మూర్త రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పరిశీలన



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న అధికారి

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి ఉన్నత పాఠశాలను భీమిలి డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు, అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాసరావు, లెక్చరర్ రవితో కూడిన పరిశీలన బృందం శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అన్ని తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. తరగతులలో సిలబస్ సకాలంలో పూర్తి కాకపోవడాన్ని గుర్తించారు. విద్యార్థులు వర్క్ బుక్స్ పూర్తి చేయకపోవడం, రాసిన కొన్నింటిని ఉపాధ్యాయులు దిద్దకపోవడాన్ని గమనించి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అభ్యసన అభివృద్ధి కార్యక్రమాలు పాఠశాలల్లో అమలు జరుగుతున్న తీరుని పరిశీలించి మెరుగుపరచాలని సూచించారు. ఉపాధ్యాయులు టీచింగ్ నోట్స్‌లు రాసి ఉండడాన్ని గమనించి ప్రశంసించారు. అదనపు సమయం కేటాయించి సిలబస్ పూర్తి చేయాలని కోరారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను ప్రత్యేకించి పరిశీలించారు.

కార్పొరేట్ కళాశాలలతో పోటీ



విద్యార్థులను సత్కరిస్తున్న శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ రమేష్

తగరపువలస: తమ విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలతో పోటీపడి గత విద్యా సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులు, ర్యాంకులు సాధించారని శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్ అన్నారు. జూనియర్ కళాశాల విద్యార్థులతో శనివారం ఏర్పాటు చేసిన ఫెస్ట్ సెలబ్రేషన్స్‌లో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులకు చదువుతోపాటు అనుసంధానంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు బాటలు వేసే శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది 40 మంది దేశ రక్షణ రంగంలోకి ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం గత ఏడాది ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. విద్యాసంస్థల సలహా కమిటీ సభ్యుడు డి.సత్యనారాయణరాజు, డిఫెన్స్ కోచింగ్ హెడ్ కె.మహేశ్వరరెడ్డి, జోనల్ ప్రిన్సిపాల్ వి.వి.డి రమేష్ పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



పుస్తకాలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

పద్మనాభం: పిల్లల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావు అన్నారు. మండలంలోని అన్నంపేట ప్రాథమిక పాఠశాలలో శనివారం ఎస్‌వోఎస్ తరఫున 200 మందికి పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కోన రమణ, ఎస్‌వోఎస్ ప్రాజెక్టు ఇన్‌ఛార్జి కె.దుర్గరాజు, కో - ఆర్డినేటర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రణాళికతో చదవాలి

పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికతో చదువుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. మండలంలోని ఆర్.వి.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన సమయంలో తల్లిదండ్రులు ఇంటి వద్ద నుంచి పిల్లలకు భోజనం తీసుకురాకూడదన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని బాలలందరికీ నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలోని ఫిర్యాదుల పెట్టె పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఐ.వి.రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండె పనితీరుపై సదస్సు



అవగాహన సదస్సులో పీజీ వైద్య విద్యార్థులు

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో గుండె పనితీరుపై పీజీ విద్యార్థులకు రెండు రోజులపాటు జరిగే అవగాహన సదస్సు శనివారం ప్రారంభమయింది. గుండె పనితీరు, స్కానింగ్‌పై అవగాహన కలిగించేందుకు ఛండీగఢ్‌కు చెందిన ప్రత్యేక నిపుణుల వైద్య బృందంతో వర్క్‌షాప్ ప్రారంభించారు.

వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ వింజమూరి ఉమా మహేశ్వరరావు పర్యవేక్షణలో రోజుకు 40 మంది వంతున మొత్తం 80 మంది పీజీ మెడికల్ విద్యార్థులు పాల్గొననున్నారు.

పెరుగుతున్న ఆర్థిక అసమానతలు



మాట్లాడుతున్న ఆర్థిక శాస్త్ర ఆచార్యుడు వంశీ

సీతంపేట: గత మూడు నాలుగు దశాబ్దాలుగా ఆర్థిక అసమానత, ఆర్థిక అస్థిరత, మానవ-ప్రకృతి పరస్పర చర్యలు పెరిగాయని ఆర్థిక శాస్త్ర ఆచార్యుడు వకులాభరణం వంశీ అన్నారు. మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'మార్క్స్ పెట్టుబడి గ్రంథం సమకాలీన ప్రాసంగికత' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఈ సమస్యలకు శాశ్వతమైన పరిష్కారం కోసం పెట్టుబడిదారీ వ్యతిరేక రాజకీయ ఎజెండా తప్పనిసరని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్పత్తి సాధనాల యజమానులు కార్మికుల అదనపు విలువలను కాజేస్తున్నారని విమర్శించారు. వ్యక్తిగత సంపద అసమానత స్థాయిల్లో చిన్నదైన కానీ గుర్తించదగిన పెరుగుదలతోపాటు వాస్తవంగా అన్ని సమూహాల్లో దేశంలో సంపదల స్థాయిలు పెరిగాయన్నారు. కార్ల్‌మార్క్స్ రాసిన గ్రంథం చదవడం ద్వారా అనేక అంశాలను అవగతం చేసుకునేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్.అంజయ్య, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం నిర్వాహకుడు జె.వి.సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు సిహెచ్.రాఘవేంద్రరావు, సీపీఐ కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అనంతుని సన్నిధిలో పూజలు



అప్పలకొండమ్మ దంపతులను సన్మానిస్తున్న సర్పంచ్ పాప, పద్మనాభం

పద్మనాభం: రథ సప్తమి సందర్భంగా పద్మనాభంలో కొలువై ఉన్న అనంత పద్మనాభ స్వామిని రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు శనివారం దర్శించుకున్నారు. అర్చక స్వాములు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి పూజలు చేయించారు. అనంతరం అప్పలకొండమ్మ, అప్పలనాయుడు దంపతులను పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, తాలాడ పద్మనాభం సన్మానించారు.

గ్రూప్-1 మెయిన్స్ అర్హత పెంపుపై హర్షం

ఎంవీపీకాలనీ: గ్రూప్-1 అభ్యర్థుల అర్హత పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో గ్రూప్-1 మెయిన్స్‌కు 1:20 నిష్పత్తిలో అభ్యర్థులను ఏపీపీఎస్సీ మెయిన్‌కు ఎంపిక చేసేదన్నారు. పెద్ద ఎత్తున నిరుద్యోగులు ఉద్యోగ అవకాశం కోల్పోతున్న నేపథ్యంలో ఆ నిష్పత్తిని 1:50కి పెంచాలని చాలా కాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. ప్రిలిమినరీ ఎగ్జామ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను 1:50 నిష్పత్తిలో మెయిన్‌కు అవకాశం కల్పిస్తూ ఏపీపీఎస్సీ నిర్ణయం ప్రకటించడంపై అభినందనలు తెలియజేశారు.